# ఈ 23న విజయ దశమి జరుపుకోవాలి

● వైదిక బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శంకరమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న వైదిక బ్రాహ్మణ సంఘం నాయకులు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 18 : విజయదశమి పర్వదినంపై ప్రజల్లో ఎలాంటి అనుమానాలు వద్దని ఈ నెల 23న సోమవారం విజయ దశమి పండుగను జరుపుకోవాలని తెలంగాణ విద్వత్ సభ నిర్ణయించినట్లు వైదిక బ్రాహ్మణ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మంతమూర్తి శంకర మూర్తి తెలిపారు. బుధవారం రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22న ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే శ్రవణ నక్షత్రం ఉన్నదున సోమవారం దశమి మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. శాస్త్రానుసారం సోమవారం అపరాహ్నము నుంచి సూర్యాస్తమయం వరకు శ్రవణ నక్షత్రంతో కూడిన దశమి ఉన్న కారణంగా అక్టోబర్ 23న సోమవారం దసర పండుగ శాస్త్ర సమ్మతమన్నారు. తెల్లవారితే శ్రవణ నక్షత్రం దశమి తిథి లేనందున టీటీడీ, ఇంద్రకీలాద్రి విజయవాడ, వరంగల్ భద్రకాళి, వేములవాడ రాజరాజేశ్వరి దేవస్థానాల్లో ఈ నెల 23న దసరా జరుపుతున్నారని ప్రజలంతా 23న దసరా జరుపుకోవాలన్నారు. సమావేశంలో వైదిక బ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి అచ్యుతరామశర్మ, పట్టణ కార్యదర్శి యల్లంభట్ల రమేశ్‌శర్మ, నాగయ్య శాస్త్రి, మంత్రమూర్తి లక్ష్మణశాస్త్రి, పులి హరిప్రసాద్, అరిపిరాల జనార్దన్, ఇరువంటి శివరామ కృష్ణ, రెంటాల సతీశ్, తేరాల కిశోర్, కృష్ణమూర్తి, ప్రసాద్, జూనూతల వశిష్టా, విశ్వేశ్వరశర్మ పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్
● మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

చివ్వెంల, అక్టోబర్ 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, ఎ.వెంకట్‌రెడ్డితో కలిసి మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో మస్టర్ ట్రైనర్లకు నియోజక వర్గానికి ఎడుగురు చొప్పున వచ్చిన 28 మంది పీఓ(ఎ.సీ.ఎల్.ఎం.టి)లకు శిక్షణ పొందిన పీఓలు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. సిబ్బంది ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన అంశాలు 17ఎ, క్లోజ్ బటన్ అన్నారు. పోలింగ్‌కు ముందు రోజు పీఓలు, ఏపీఓలు జాగ్రత్తగా ఉండాలని పోలింగ్ బూత్‌ల్లో ఓటు వేయడానికి వచ్చిన ప్రజా ప్రతినిధులకు బ్యాలెట్ బాక్స్ పక్కనే ఫొటోలు, వీడియోలు లాంటివి అనుమతించవద్దన్నారు. ముఖ్యంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, మాక్ పోలింగ్ విధానం, ఎన్నికల ఫారాలు నింపే విధానం, నమూనా ఈవీఎంలపై శిక్షణ, మాక్ పోలింగ్ విధానంపై శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన పీఓలు ఆయా నియోజక వర్గాల్లో 1,374 మంది పీఓలు, 5,365 మంది ఏపీఓలు, 1,201 మంది బీఎల్ఓలకు ఎన్నికల నిర్వహణ, విధి విధానాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఓ సాంబిరెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ రమేశ్, ఏడీఏ రామారావునాయక్, పీఓలు పాల్గొన్నారు.

## కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్ పరిశీలన..

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేలా వ్యవసాయ మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మెటీరియల్ స్వీకరణకు రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ మెటీరియల్, పోలింగ్ బాక్సులు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములను పరిశీలించి సీసీ కెమెరాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ వీరబ్రహ్మాచారి, డీఎస్పీ నాగభూషణం, డీఎం సివిల్ సప్లయ్ రాంపతినాయక్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీల అమలులో కేంద్రం విఫలం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్‌రావు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్‌రావు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 18 : రైతు చట్టాలు రద్దు చేయాలని ఆందోళన చేసిన రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. బుధవారం సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా రెండోరోజు విఘ్నేశ్వర ఫంక్షన్‌హాల్‌లో జరిగిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. దేశ భవిష్యత్‌ను మార్చేది సోషలిజమేనని అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

# ఏఎస్ఐ కిశోర్‌కు జాతీయ స్థాయి సంఘమిత్ర పురస్కారం



జాతీయస్థాయి పురస్కారం అందుకుంటున్న ఏఎస్ఐ కిశోర్

సూర్యాపేటసిటీ, అక్టోబర్ 18 : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐగా పని చేస్తున్న పల్లేటి కిశోర్‌కుమార్ సంఘమిత్ర జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల సౌజన్యంతో కిశోర్ చేసిన రచనలు, కవితలు, సేవా కార్యక్రమాలకు ఈ పురస్కారం లభించింది. తెలుగు కళా దర్బార్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో పుడమి సాహితీ వేదిక చైర్మన్ చిలుముల బాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కమిషనర్ కస్టమ్స్ ఎస్.కె.రహమాన్, ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారి డి.నాగేశ్వర్‌రావు, డి.రాజేశ్వర్‌రావు చేతుల మీదుగా కిశోర్ పురస్కారాన్ని అందుకున్నారు. కిషోర్ జాతీయ పురస్కారం అందుకోవడం పట్ల పోలీసు అధికారులు, కళాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## పైళ్ల నవీన్‌కుమార్‌రెడ్డికి ఓయూ డాక్టరేట్

వలిగొండ, అక్టోబర్ 18 : మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన పైళ్ల నవీన్‌కుమార్‌రెడ్డికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిం ది. రసాయన శాస్త్రంలో ప్రొఫెసర్ కుతాటి భాస్కర్ పర్యవేక్షణలో స్పెక్ట్రోఫొటోమెట్రిక్ డిటెర్మినేషన్ ఆఫ్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ బైయాసింగ్ పోలిన్ సియోకాల్టె పోటాషియం పర్మాంగనేట్ ఆక్సిడైజింగ్ రియేజెంట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రంలో సమర్పించిన ప్రయోగాత్మక వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమైనట్లు పేర్కొన్నారు. నవీన్‌కుమార్‌రెడ్డి మేడ్చల్ జిల్లాలో నాయబ్ తాసీల్దార్‌గా ఉద్యోగం చేస్తూ డాక్టరేట్ పొందడంపై కుటుంబసభ్యులు అభినందించారు.

## రమణేశ్వరంలో ప్రత్యేక పూజలు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 18 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో గల శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాల్గొవ రోజు కూష్మాండాదేవిగా పార్వతీదేవి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సిద్ధగురు రమణానందమహర్షి మాట్లాడుతూ దేవతామూర్తులను ఆరాధిస్తే అహంకారం నశించి, సంపద, ఆరోగ్యప్రాప్తి చేకూరుతుందని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## మీసాల గణేశ్‌కు జాతీయ అవార్డు



జాతీయ అవార్డు అందుకుంటున్న మీసాల గణేశ్

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 18: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నాలుగొవ నేషనల్ కాన్ఫరెన్స్‌లో భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు మీసాల గణేశ్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డును సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ ఏటా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. మీసాల గణేష్ అవార్డు అందుకోవడంపై జానపద కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

# బీజేపీ నాయకులను గ్రామాల్లో తిరుగనీయం

● ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌మాదిగ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 18 : అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాట తప్పిందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పడిదల రవికుమార్‌మాదిగ అన్నారు. ఇప్పటికైనా వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని లేకపోతే ఆ పార్టీ నాయకులను గ్రామాల్లో తిరుగనీయమని హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలో నవంబర్ 5న జరిగే మాదిగల యుద్ధ భేరి సన్నాహక ర్యాలీని నిర్వహించి అనంతరం కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పల్లేటి లక్ష్మణ్, బొజ్జ పరశురామ్, కనుక జానయ్య, వెంకటేశ్, శ్రావణ్, ఈదయ్య, సైదులు, నాగరాజు, రోహిత్, మంజునాథ్, చింటూ, ప్రేమ్‌కుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

● బీఆర్ఎస్‌వై ఆలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మోటకొండూర్, అక్టోబర్ 18 : సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని బీఆర్ఎస్‌వై ఆలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ యూత్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరును అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గొంగిడి సునీతామహేందర్ రెడ్డి వైపే ప్రజలకు ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు భూమండ్ల సుధీర్, జివిలికపల్లి వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

భువనగిరి సిటీ, అక్టోబర్ 18: వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చిలకమర్రి గణేశ్‌మాదిగ కోరారు. బుధవారం భువనగిరిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నవంబర్ 5న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల యుద్ధభేరి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు పాల్గొన్నారు.

# బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘ్ నూతన కమిటీ

పెన్‌పహాడ్, అక్టోబర్ 18 : బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘ్ నూతన కమిటీని ధరావత్ అజయ్ నాయక్ ఆధ్వర్యంలో పెన్‌పహాడ్ మండల కేంద్రంలో బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా రమావత్ గోపి, భర్మవత్ కృష్ణ సందీప్, అధ్యక్షుడిగా ధరావత్ రమేశ్‌నాయక్, ఉపాధ్యక్షులుగా వాంకుడోతు కళావతి, గుగులోకి ఇందిరా, ధరావత్ సంధ్య, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ మనోజ్‌నాయక్, కోశాధికారిగా అజ్మీరా హుస్సేన్‌నాయక్, కార్యదర్శులుగా ఆంగోతు యాదగిరి, భూక్యా విజయ, రాములునాయక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ధరావత్ రఘుపతినాయక్, గుగులోతు రమేశ్‌నాయక్, గుగులోతు శివకుమార్ పాల్గొన్నారు.